సూచించిన ప్రాంతాల్లోనే నిర్మాణ వ్యర్థాలను వేయాలి

కూకట్‌పల్లి: నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను యూజర్ చార్జీలు చెల్లించకుండా ఉండేందుకు ప్రైవేట్ ట్రక్కుల వారు అక్రమంగా వివిధ ప్రదేశాల్లో రోడ్డు పక్కన డంపింగ్ చేస్తున్నారు. దీంతో ప్రజలు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ఇటువంటి ఇబ్బందులను తొలగించేందుకు జీహెచ్ఎంసీ కొన్ని ప్రదేశాలను గుర్తించిందని కూకట్‌పల్లి కమిషనర్ ఓ ప్రకటనలో తెలిపారు. జీహెచ్ఎంసీ జోనల్ కమిషనర్ ఆదేశాల మేరకు కూకట్‌పల్లి జోన్‌లోని నిర్మాణ, కూల్చివేత వ్యర్థాలను షాపూర్ ట్రాన్స్‌ఫార్మర్ స్టేషన్, షాపూర్ పైపులైన్ రోడ్డు, డవస్పీ కార్యాలయం ఎదురుగా డంపింగ్ చేయాలని సూచించారు. మరిన్ని వివరాలకు మూసాపేట, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, గాజులరామారం ప్రాంతాలకు చెందిన వారు లక్ష్మీరెడ్డి ఫోన్ నం.83755 78220, ఆల్వాల్ ప్రాంతానికి చెందిన వారు శివర్ధన్‌రెడ్డి, ఫోన్ నం .87126 04625 సంప్రదించాలని కోరారు.

లైఫ్‌స్టైల్ భవనంలో అగ్నిప్రమాదం

పంజగుట్ట: బేగంపేట లోని లైఫ్‌స్టైల్ భవనంలో శుక్రవారం మధ్యాహ్నం స్వల్ప అగ్ని ప్రమాదం జరిగింది. వెంటనే అప్రమత్తమైన భవన నిర్వహణ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. వివరాల్లోకి వెలితే .. జ్యోతిబా పూలే ప్రజాభవన్ ఎదురుగా ఉన్న లైఫ్‌స్టైల్ భవనంలోని మొదటి అంతస్థులో ఓ హోటల్ కొనసాగుతోంది. అందులోని కిచెన్‌లో గ్యాస్ లీకేజీ కావడంతో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. అప్రమత్తమైన హోటల్ సిబ్బంది మంటలను కొంతమేర అదుపులోకి తెచ్చారు. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించడంతో సంఘటనా స్థలానికి చేరుకున్న వారు మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు. గ్యాస్ లీకేజీ కారణంగానే ప్రమాదం చోటు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

నగరంలో 'వోల్టా రైడ్' సేవలు

లక్డీకాపూల్: నగరంలో ప్రయాణాన్ని మరింత సులభతరం చేసే క్రమంలో వోల్టా రైడ్ సేవలను అందుబాటులోకి తీసుకురానున్నట్లు రైడ్ షేరింగ్ స్టార్టప్ వ్యవస్థాపకులు శశికాంత్ కనపర్తి తెలిపారు. ప్రయాణికుల సౌకర్యమే ధ్యేయంగా, (జీరో పర్సెంట్ కమిషన్) డ్రైవర్లకు తక్షణ చెల్లింపులే లక్ష్యంతో ఈ సేవలను అందించనున్నట్లు చెప్పారు. మార్కెట్‌లోని ఇతర రైడ్ షేరింగ్ సర్వీసుల కంటే భిన్నంగా వోల్టా సంస్థ కస్టమర్లను వారి గమ్య స్థానాలకు చేర్చే బృహత్తర కార్యక్రమాన్ని చేపట్టామని... ఇందులో భాగంగా సంప్రదాయ రైడ్ షేరింగ్ సంస్థల నుంచి డ్రైవర్లు తరచు ఎదుర్కొనే అధిక కమిషన్ భారం, ఆలస్యంగా చెల్లించే చెల్లింపుల భారం నుంచి విముక్తి కలిగించామన్నారు. 'రైడ్ ఛార్జీలు ఎక్కువగా ఉన్నాయని, తక్కువ ఛార్జీలు చెల్లించేలా మరో రైడ్ కోసం ఎదురు చూసే పనిలేదన్నారు. వోల్టా యాప్‌లో తక్కువ ప్రయాణ ధరల్ని సూచించేలా యాప్‌లో ప్రయాణికులకు సరికొత్త ఫీచర్లను అందిస్తున్నామని తెలిపారు. ఫలితంగా తక్కువ ఛార్జీలను చెల్లించి వారి చేరుకోవాల్సిన గమ్య స్థానాలకు సురక్షితంగా చేరుకోవచ్చని వోల్టా సీఈఓ రాజా విక్రమ్ తెలిపారు. వోల్టా యాప్ ఐఓఎస్, అండ్రాయిడ్ యాప్ స్టోర్‌లో డౌన్‌లోడ్ చేసుకునేందుకు వీలుగా అందుబాటులోకి తెచ్చామని చెప్పారు.

నిమ్స్‌లో ఐదుగురు రిటైర్డ్ అధికారులు

లక్డీకాపూల్: నిమ్స్‌లో కొనసాగుతున్న విశ్రాంత అధికారులను జాబితాను యాజమాన్యం ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చింది. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆదేశాల మేరకు ఆస్పత్రిలో ఉద్యోగ విరమణ తర్వాత కూడా విధుల్లో కొనసాగుతున్న వారి వివరాలను అందించింది. ఈ జాబితాలో డిప్యూటేషన్ పద్ధతిలో నిమ్స్ విస్తరణ ప్రాజెక్ట్ విధులు నిర్వహిస్తున్న ఎస్.మధుసూదన్, ఆర్ అండ్ బీ రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ లక్ష్మారెడ్డి, రవీంద్ర రెడ్డి, లీగల్, హెచ్‌ఆర్ కన్సల్టెన్సీ డాక్టర్ నబీ, ఎలక్ట్రికల్ ఈఈ అశోక్ ఉన్నారు.

శోభాయాత్రలో సంయమనం పాటించాలి

ఎస్‌ఆర్‌నగర్ ఏసీపీ వెంకటేశ్వరావు

రహమత్‌నగర్: శోభాయాత్రలో భకుతలు సంయమనం పాటించాలని ఎస్ఆర్‌నగర్ డివిజన్ ఏసీపీ వెంకటేశ్వరావు నిర్వాహకులకు సూచించారు. శోభాయాత్ర నిర్వహణకు తప్పని సరిగా పోలీసుల అనుమతి తీసుకొని, యాత్ర సాగే ప్రాంతాల వివరాలు తెలియపర్చాలని ఆదేశించారు. ఈ నెల 22 అయోధ్యలో బాల రాముని విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాన్ని పురస్కరించుకుని శోభాయాత్రాలు నిర్వహించే ప్రతిభానగర్, కార్మికనగర్, శ్రీరాంనగర్ ఆలయాలను ఆయన శుక్రవారం పరిశీలించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ... శోభాయాత్ర శాంతియుతంగా కొనసాగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసు బందోబస్తు నిర్వహిస్తామన్నారు. నిర్ణీత సమయంలోపు యాత్ర ముగించాలని స్పష్టం చేశారు. బోరబండ డీఐ భూపాల్‌గౌడ్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

24న జాతీయ బాలిక దినోత్సవం

సాక్షి, మేడ్చల్‌జిల్లా: ఈ నెల 24న జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని బేటీ బచావో– బేటీ పడావో పథకంలో భాగంగా ఐదు రోజులు పలు కార్యక్రమాలను నిర్వహిస్తామని జిల్లా సంక్షేమ అధికారి జి.క్రిష్ణ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు, విజ్ఞాన శాస్త్ర పరిశోధనలు, పిల్లల లింగ నిష్పత్తిపై గ్రామస్థాయిలో మహిళా సభలు, గ్రామ సభలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ నెల 24న జాతీయ బాలిక దినోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తామని, ఇందులో వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేస్తామని తెలిపారు.

నేడు, రేపు పోలింగ్ కేంద్రాల్లో బీఎల్ఓలు

రెండు రోజుల పాటు ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలు

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ఎన్నికల సంఘం జారీ చేసిన షెడ్యూల్ మేరకు మొదటి సంక్షిప్త ఓటరు జాబితా సవరణలో భాగంగా ఈ నెల 20, 21 తేదీల్లో స్పెసల్ క్యాంపెయిన్ డేస్‌ను నిర్వహిస్తున్నారు. శని, ఆదివారాల్లో అన్ని పోలింగ్ కేంద్రాల్లో బూత్ లెవల్ అధికారులు అందుబాటులో ఉంటారు.

- అందుబాటులో ఉండనున్న అధికారులు
- ఓటు నమోదుతో పాటు సవరణలకూ అవకాశం
- వినియోగించుకోవాలంటున్న జీహెచ్ఎంసీ అధికారులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజకవర్గం పరిధిలోని 240 పోలింగ్ కేంద్రాల్లో, జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని 329 పోలింగ్ కేంద్రాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు బీఎల్‌ఓలు అందుబాటులో ఉండి కొత్త ఓటరు నమోదుతో పాటు సవరణలకు అవకాశం కల్పించడమే కాకుండా ఇందుకు సంబంధించిన ఫారాలను అందుబాటులో ఉంచనున్నారు.

◆ 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారంతా ఓటరు నమోదుకు ఫారం–6లో వివరాలు భర్తీ చేసి దరఖాస్తును అక్కడే ఉండే బీఎల్‌ఓలకు అందించవచ్చని జీహెచ్ఎంసీ ఖైరతాబాద్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, సర్కిల్–18 డీఎంసీ ప్రశాంతి తెలిపారు.

◆ ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర సవరణలు, నియోజకవర్గంలోని పోలింగ్ కేంద్రం మార్పు, ఇతర నియోజకవర్గంలోకి పేరు మార్పు, అభ్యంతరాలపై దరఖాస్తులు స్వీకరిస్తారని, ఆన్‌లైన్‌లోనూ దరఖాస్తు చేసుకోవచ్చని ఆమె తెలిపారు.



ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలపై సమీక్షిస్తున్న ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే

◆ ఇందుకోసం అన్ని పోలింగ్ బూత్‌లలో ఏర్పాట్లు పూర్తిచేశారు.

◆ ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రాలకు సంబంధించి ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ వెంకటేష్ ధోత్రే సమీక్ష నిర్వహించారు.

◆ ముసాయిదా జాబితాపై ఏవైనా అభ్యంతరాలు ఉంటే వాటిని 21 తరువాత వారం రోజుల్లో పరిష్కరిస్తారు. ఫిబ్రవరి 8న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు.

◆ ఫారం–6 ద్వారా నూతన ఓటరుగా నమోదు, ఏవైనా అభ్యంతరాలు ఉంటే ఫారం–7, ఓటరు స్థాన చలనం తదితర మార్పుల కోసం ఫారం–8 ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చు.

◆ ఇంకోవైపు ఫిబ్రవరి 8న ఓటరు తుది జాబితా ప్రకటించనుండగా వాటి ఆధారంగా పార్లమెంట్ ఎన్నికలు జరుగుతాయని అధికారులు తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

అల్విన్‌కాలనీ: హెచ్ఎంటీహిల్స్ 33/11 కేవీ ఫీడర్ పరిధిలో శనివారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు ఏఈ ఓ ప్రకటనలో తెలిపారు. వెస్టన్ హిల్స్, విజేత సూపర్ మార్కెట్ వెనుక వైపు, అడ్డగుట్ట రోడ్డు నం.5 నుంచి 10, ఐసీఐసీఐ బ్యాంక్ వెనుక వైపున ఉన్న ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి 4.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

◆ **మూసాపేట:** ఆర్‌వీ లక్ష్మి ఫీడర్ పరిధిలో శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఎలక్ట్రికల్ ఏఈ శంకర్ తెలిపారు. ఆర్‌వీ లక్ష్మి, వివేకినగర్ రోడ్‌నం.1 నుంచి 4, న్యూ బాలాజీనగర్ ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

స్కాలర్‌షిప్ దరఖాస్తుల గడువు పొడిగింపు

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో దివ్యాంగ విద్యార్థులకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్ దరఖాస్తు చేసుకోవడానికి ఈ నెల 31 వరకు పొడగించినట్లు మహిళా, శిశు, వికలాంగులు, వయోవృద్ధులు సంక్షేమ శాఖ తెలిపింది. అర్హత కలిగిన దివ్యాంగ విద్యార్థులు వెబ్ సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని జిల్లా సంక్షేమ అధికారి ఎమ్.క్రిష్టారెడ్డి తెలిపారు.

సంక్షేమ పథకాలతో లబ్ధి పొందాలి

కూకట్‌పల్లి: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దరఖాస్తు చేసుకొని లబ్ధి పొందాలని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు పేర్కొన్నారు. మూసాపేటకు చెందిన అక్షయ్ కుమార్‌సింగ్ అనారోగ్యంతో ఆస్పత్రిలో వైద్యం చేయించుకొని ముఖ్యమంత్రి సహాయ నిధికి దరఖాస్తు చేసుకున్నారు. ఈ మేరకు మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ రూ.లక్ష చెక్కును శుక్రవారం ఎమ్మెల్యే కృష్ణారావు లబ్ధిదారుడికి అందజేశారు.



లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

21న బాలికల సాధికారత వాక్

పంజగుట్ట: జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ (ఆదివారం)న ఉదయం 7 గంటలకు నెక్లెస్ రోడ్డులో 'బాలికల సాధికారత కోసం వాక్ నిర్వహించనున్నట్లు చైల్డ్ రైట్స్ అండ్ యు (క్రై) తెలుగు రాష్ట్రాల ఆపరేషన్స్ ఇన్‌చార్జి బడుగు చెన్నయ్య తెలిపారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో వాక్ కరపత్రాన్ని క్రై సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ... ప్రస్తుత కంప్యూటర్ యుగంలోనూ బాలికల పరిస్థితి ఆశించినంతగా ఎదగలేదని, ఇప్పటికీ విద్య, ఆరోగ్య, రక్షణ విషయాలు ఆందోళనకరంగా ఉండటం బాధాకరమన్నారు. దేశ బాలికలకు మరింత ఆశాజనక భవిష్యత్ రూపొందించేందే ప్రయత్నంలో భాగమే ఈ వాక్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర పోలీస్ ఉమెన్ సేఫ్టీ వింగ్, హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ, ఎస్‌బీఐ లైఫ్, కామినేని ఆస్పత్రిలు భాగస్వాములుగా ఉన్నాయని తెలిపారు. వాక్‌ను ఐపీఎస్ అధికారి శిఖా గోయల్ ప్రారంభిస్తారని తెలిపారు. కార్యక్రమంలో క్రై సభ్యులు సత్య, సౌమ్య, సోనిలు పాల్గొని వారి కుటుంబాల్లో చిన్నతనంలో వివాహం చేసేందుకు యతిస్తే దాన్ని అధిగమించి ఎలా చదువుకుంటున్నారో వివరించారు.

ఉద్యానవనం పరిరక్షణకు చర్యలు తీసుకుంటాం

కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

అల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని పీజేఆర్‌నగర్ ఫేజ్–2లో బతుకమ్మ పార్కు పరిసరాల్లో ఉన్న స్థలంలో కొంతమంది ఆకతాయిలు నిప్పు పెట్టడంతో చెట్లు కాలిపోయాయి. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అర్బన్ హెచ్‌ఏ నాగరాణితో కలిసి సంఘటనా స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో గతంలో క్వారీ గుంత ఉండేదన్నారు. గుంతను పూడ్చి మూడు వేల పైచిలుకు మొక్కలతో ఉద్యానవనంగా తీర్చిదిద్ది సుందరీకరించామని గుర్తు చేశారు. కొంతమంది ఆకతాయిలు మొహరించి ఉద్యానవనాన్ని పాడుచేస్తున్నారని తెలిపారు. ఈ విషయాన్ని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి ఉద్యానవనం చుట్టూ ఫెన్సింగ్, ముఖద్వారం గేటు ఏర్పాటు చేసేలా చూస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నోళ్ల శ్రీనివాస్, రామస్వామి, షకీల్, మున్నా, సలీమ్, భిక్షపతి, మోజెస్, పోశెట్టిగౌడ్, సాయిగౌడ్, మహిళా గౌరవ అధ్యక్షురాలు మధులత, నస్రీన్, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.



చెట్లుకు నిప్పు పెట్టిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

పార్లమెంట్ ఎన్నికలకు యంత్రాంగం సన్నద్ధం

వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: ఎన్నికల కమిషన్ సూచనల ప్రకారం మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లాలో పార్లమెంట్ ఎన్నికలకు అధికార యంత్రాంగం సిద్ధంగా ఉందని, ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు సన్నద్ధమవుతున్నట్లు కలెక్టర్ గౌతమ్ తెలిపారు. ఈ విషయంలో ఇప్పటి నుంచే సంబంధిత అధికారులకు సూచనలు చేసినట్లు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ నుంచి ఆయన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్, ఇతర ముఖ్య ఎన్నికల అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్‌లో ట్లాడారు. జిల్లావ్యాప్తంగా ఎన్నికలకు సంబంధించి ఫారం–6, 7, 8లను ఈ నెల 22 వరకు పూర్తి చేస్తామని ఆయన తెలిపారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో పోస్టల్ బ్యాలెట్ సంబంధించి.. ముందస్తు ప్రణాళిక రూపొందించి సంబంధిత అధికారుల ద్వారా అందజేస్తామన్నారు. ఈ నెల 20, 21 తేదీల్లో ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ, ఈఆర్వోలు పాల్గొన్నారు.

మహిళలను వేధిస్తే ఇక జైలుకే..

నగర షీ టీమ్స్ డీసీపీ కవిత

హిమాయత్‌నగర్: మహిళలు, యువతులను వేధిస్తే ఇక జైలుకు వెళ్లాల్సిందే. నగరంలోని పలు రద్దీ ప్రాంతాలలో మహిళలను వేధిస్తున్న పోకిరీలు, ఆకతాయిలపై కఠిన చర్యలు తీసుకుంటున్నామని నగర షీ టీమ్ డీసీపీ కవిత వెల్లడించారు. జనవరి నెలలో షీ టీమ్ పోలీసులు మఫ్టీలో నుమాయిష్ ఎగ్జిబిషన్, కైట్ ఫెస్టివల్ సమయంలో పీపుల్స్ ప్లాజా, చార్మినార్, అఫ్జల్‌గంజ్ బస్టాప్, పరేడ్ గ్రౌండ్స్, సిటీలోని వివిధ ప్రాంతాలలో మహిళలను అసభ్యకరంగా తాకుతూ వేధిస్తున్న 39 మందిని రెడ్ హ్యాండెడ్‌గా వీడియో ఆధారాలతో పట్టుకొని కేసులు నమోదు చేశామని తెలిపారు. వీరిలో పది మందికి నిందితులకు కోర్టు 3 రోజుల జైలు శిక్ష, రూ. 250 జరిమానా విధించారన్నారు. మరో ముగ్గురుని మందలించి నోటీసులు ఇచ్చినట్లు తెలిపారు. మిగిలిన 26 మందిపై కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. నగరంలోని మహిళలకు సురక్షితమైన వాతావరణాన్ని అందించడానికి, బహిరంగ ప్రదేశాల్లో,రవాణా ప్రాంతాలలో షీ టీమ్ పోలీసులు నిరంతరం నిఘా పెట్టి పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. వేధింపుల విషయంలో మహిళలు ఫిర్యాదులు ఉంటే సిటీ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో లేదా అత్యవసర పరిస్థితుల్లో 100కి డయల్ చేయాలని డీసీపీ సూచించారు.

ఉచిత వైద్య శిబిరం

మోతీనగర్: మూసాపేట డివిజన్ కబీర్‌నగర్ కమ్యూనిటీహాల్‌లో ఏజీఐ గ్రీన్ ప్యాక్, ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం శుక్రవారం నిర్వహించారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో వైద్యులు బసవయ్య, మానికరెడ్డి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో బీపీ, మధుమేహం, చర్మ, దంత సాధారణ వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు సైతం అందజేశారు. కార్యక్రమంలో ఏజీఐ గ్లాస్ ఫ్యాక్టరీ సిబ్బంది నాయుడు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ప్రజలు వైద్యుల సూచన మేరకు మందులు వాడాలని కబీర్ నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కె. జోసెఫ్ పేర్కొన్నారు.



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు బసవయ్య

గొలుసు చోరీ చేసిన వ్యక్తి అరెస్టు

- గొలుసు రికవరీ • పరారీలో ఇద్దరు

మూసాపేట: ఓ వ్యక్తి మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని పరారైన సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సబ్ ఇన్‌స్పెక్టర్ ఇంద్ర సేనారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఘట్‌కేసర్‌కు చెందిన శివ చంద్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. భాగ్యనగర్‌కాలనీలోని హాస్టల్‌లో ఉండే తన స్నేహితుడిని కలిసేందుకు వచ్చాడు. బుధవారం రాత్రి 11 గంటల సమయంలో భాగ్యనగర్ నుంచి గాంధీ విగ్రహం వద్దకు నడుచుకుంటూ వెళ్తున్నాడు. గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు ఆటోలో వచ్చి శివచంద్ మెడలో నుంచి గొలుసును గుంజుకొని పారిపోయారు. గురువారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. డీఐ వెంకటేశం ఆధ్వర్యంలో దర్యాప్తు ప్రారంభించిన క్రైం ఎస్ఐ ఇంద్రసేనారెడ్డి, క్రైంటీమ్ ముగ్గురిలో ఒకరైన షేక్‌వారీస్‌ను అరెస్ట్ చేశారు. అతడి నుంచి గొలుసును రికవరీ చేసి న్యాయస్థానం ముందు హాజరు పరిచి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న ఇద్దరిని పట్టుకునేందుకు గాలింపు చేపట్టామన్నారు.

భవనంపై నుంచి పడి కార్మికుడి మృతి

భాగ్యనగర్‌కాలనీ: ప్రమాదవశాత్తు భవనం ఐదో అంతస్తు నుంచి పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం చోటు చేసుకుంది. కేపీహెచ్‌బీ సీఐ వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రానికి చెందిన దేవబ్రత్ బెహరా (18) నగరానికి వలస వచ్చి భగత్‌సింగ్ నగర్‌లో ఉంటూ ఫాల్ సీలింగ్ పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. రాత్రి 12 గంటల వరకు సోదరుడు, మిత్రులతో కలిసి మద్యం సేవించాడు. అనంతరం 5వ ఫ్లోర్‌లో నిద్రపోయారు. నిద్ర మత్తులో భవనంపై నుంచి కింద పడి మృతి చెందినట్లు పోలీసులు భావిస్తున్నారు. సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు.



మృతి చెందిన దేవబ్రత్ బెహరా

మహేష్‌కుమార్‌గౌడ్‌కు శుభాకాంక్షలు

ఓల్డ్ బోయిన్‌పల్లి: టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేయడం ఆనందంగా ఉందని టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి అన్నారు. ఓల్డ్ బోయిన్‌పల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జునయాదవ్‌తో శుక్రవారం మహేష్‌కుమార్‌గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలసి శుభాకాంక్షలు తెలిపారు.



ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపికైన మహేష్‌కుమార్ గౌడ్‌ను మర్యాద పూర్వకంగా కలసిన దండుగుల యాదగిరి

నేడు, రేపు ఓటరు నమోదు ప్రక్రియ

జిల్లా కలెక్టర్ గౌతమ్

సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో శని, ఆదివారాల్లో నిర్వహించే ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ పి.గౌతమ్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఓటు హక్కు లేని.. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు. ఆ దిశగా అధికారులు, క్షేత్రస్థాయి సిబ్బంది ఓటు హక్కు ప్రాధాన్యత పేర్కొంటూ.. 18 సంవత్సరాలు నిండిన యువతీ, యువకులు తప్పనిసరి ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా చొరవ చూపాలన్నారు. ఓటరు నమోదుకు సంబంధించి ప్రత్యేక క్యాంపెయిన్ జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. చిరునామా తదితర సవరణల గురించి రెండు రోజులపాటు స్పెషల్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా సవరణ గురించి చేసిన షెడ్యూల్‌లో ఈ స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహిస్తామన్నారు. బూత్ లెవల్ అధికారులు(బీఎల్వోలు) పోలింగ్ కేంద్రాల్లో ముసాయిదా ఓటరు జాబితా సంబంధిత ఫారం (6 – 8)లతో ఈ రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ అవకాశాన్ని యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.

ఆ పిల్లలు చదువుకు దూరం

- వివిధ కారణాలతో బడిమానేసిన వైనం
- బడి బయట 307 మంది పిల్లలు
- సర్వేలో గుర్తించిన జిల్లా విద్యాశాఖ
- బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా..
- సమీప బడుల్లో చేర్పించిన అధికారులు





సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో బడి బయట పిల్లలు 307 మంది ఉన్నట్లు విద్యాశాఖ గుర్తించింది. వీరందర్నీ సమీప పాఠశాలల్లో చేర్పించడం ద్వారా.. మళ్లీ చదువుకునేలా చర్యలు తీసుకుంది. బాలకార్మిక వ్యవస్థ నిర్మూలన లక్ష్యంగా ప్రభుత్వం ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖ గత నెల 11 నుంచి ఈ నెల 10 వరకు బడిబయట పిల్లలను గుర్తించేందుకు సర్వే కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సర్వే కార్యక్రమాన్ని సీఆర్పీలు, ఐఈఆర్పీలు చేపట్టారు. ప్రతి సంవత్సరం బడి బయట ఉన్న 6 నుంచి 14 సంవత్సరాల మధ్య ఉన్నవారిని సర్వేలో భాగంగా గుర్తిస్తున్నారు.

మేడ్చల్ జిల్లాలో 516 బడులు..

శివారు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా పరిధిలో 516 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. ఆర్థిక పరిస్థితులు తదితర పలు కారణాల నేపథ్యంలో కొందరు చదువులకు దూరంగా ఉంటున్నారు. మరి కొందరు తల్లిదండ్రులకు ఆసరా కోసం మధ్యలోనే చదువులను మానేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలలు అందుబాటులో లేకపోవడంతో పాటు సమీపంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజులు చెల్లించలేక బడులకు దూరమవుతున్నారు. గ్రామ పంచాయతీ, పురపాలక సంఘాలు, బస్తీల పరిధిలో జిల్లా విద్యాశాఖకు చెందిన ఐఈఆర్పీలు, సీఆర్పీలు క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. ఆర్థిక ఇబ్బందులతో చాలామంది బడి మానేసి పనులకు వెళ్తున్న పిల్లలు ఉన్నారు. సర్వే నామమాత్రంగా కాకుండా పకడ్బందీగా నిర్వహిస్తే.. బడి బయట ఉన్న పిల్లల సంఖ్య పెరిగే అవకాశం ఉండేదని పలువురు పేర్కొంటున్నారు.

బడి బయట పిల్లలు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఈ విద్యా సంవత్సరంలో బడి బయట ఉన్న పిల్లలు 307 మంది ఉన్నట్లు గుర్తించారు. వీరంతా 6 నుంచి 14 ఏళ్ల ఉన్నారు. అలాగే.., 2021–22 సంవత్సరంలో 247 మంది పిల్లలు బడి బయట ఉండగా, ఇందులో 6–14 ఏళ్లలోపు 238 మంది పిల్లలు, 14–19 ఏళ్లలోపు 09 మంది ఉన్నారు. 2020–21లో నిర్వహించిన సర్వేలో జిల్లాలో 294 మంది బడి బయట ఉండగా, ఇందులో 6–14 ఏళ్లలోపు 254 మంది పిల్లలు, 15–19 ఏళ్లలోపు 40 మంది ఉన్నారు. వీరందరికీ సమీప పాఠశాలలు, లేదా సార్వత్రిక విద్యాలయాల్లో ప్రవేశాలు కల్పించి చదువుకునేలా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకున్నారు.

సర్వే పకడ్బందీగా చేశాం..

ప్రభుత్వ ఆదేశాల మేరకు బడి బయట ఉన్న పిల్లలతో పాటు మధ్యలో బడి మానేసిన పిల్లల గుర్తింపునకు సర్వే నిర్వహించాం. గుర్తించిన పిల్లలందర్నీ సమీప బడుల్లో చేర్పించాం.బడీడు పిల్లలందరూ.. బడుల్లో ఉండాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు చర్యలు తీసుకుంటున్నాం.

– ఐ.విజయకుమారి, జిల్లా విద్యాశాఖ అధికారి